నేటి నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 19వ తేదీ నుంచి తోలేరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్టు కళాపరిషత్ అధ్యక్షులు చవాకుల సత్యనారాయణ సోమవారం తెలిపారు. పసుపులేటి నాగేశ్వరరావు కళా ప్రాంగాణం వేదికగా నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో 19న హర్ష క్రియేషన్స్ విజయవాడ వారి స్వర్ణ కమలాలు, 20న చైతన్య కళాభారతి కరీంనగర్ వారి చీకటి పువ్వు, శర్వాణీ గిరిజన సాంస్కృతిక సేవా కేంద్రం బోరివంక వారి కొత్త పరిమళం, 21న సిరిమువ్వ కల్చరల్ హైదరాబాద్ వారి థింక్, ఉషోదయా కళానికేతన్ కట్రపాడు వారి మిముక్తి, 22న అమృత లహరి ఆర్ట్స్ గుంటూరు వారి నాన్నా నేనొచ్చేస్తా నాటికలు ప్రదర్శించనున్నారు. 23న బహుమతులు ప్రదానం చేయనున్నారు. పోటీల సందర్భంగా ప్రముఖ సినీ ప్రముఖులు ఆర్.నారాయణమూర్తి, ప్రఖ్యాత రంగస్థల నటులు గుమ్మడి గోపాలకృష్ణను కళాపరిషత్ ఘనంగా సత్కరించనున్నారు.

అంగన్‌వాడీలపై కక్షసాధింపు..

గొల్లలకోడేరులో చిన్నారులు లేక ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

- సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో కేంద్రాల నిర్వహణకు యత్నం
- చిన్నారుల్లేక వెలవెలబోతున్న అంగన్‌వాడీ కేంద్రాలు
- చిన్నారులకు మధ్యాహ్నం భోజనాన్ని పెట్టాలని ప్రభుత్వం ఆదేశం
- అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

ప్రజాశక్తి - భీమవరం

అంగన్‌డీలపై ప్రభుత్వం కక్ష సాధింపు కొనసాగిస్తోంది. కేంద్రాలను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తోంది. సమ్మెను సైతం లెక్కజేయకుండా ప్రత్యామ్నాయ చర్యలను ముమ్మరం చేస్తోంది. సచివాలయ ఉద్యోగులు. వాలంటీర్లకు కేంద్రాల నిర్వహణ బాధ్యతను పూర్తిగా అప్పగించేందుకు ఏపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోంది. అంగన్‌వాడీ చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులపై మరింత భారం పడనుంది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీల సమ్మె మరింత ఉధృతం చేశారు. కార్మిక సంఘం నేతలు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణతో అంగన్‌వాడీలు ముందుకు సాగుతున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. అనేక రూపాల్లో అంగన్‌వాడీలు ఆందోళనలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం సానుకూలత చూపించలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు తప్పని పరిస్థితుల్లో మూకుమ్మడిగా సమ్మెలోకి వెళ్లారు. వారం రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మాత్రం కనీసం కనికరం చూపించట్లేదు. పలు దఫాల్లో యూనియన్ నేతలతో ప్రభుత్వం కంటి తుడుపు చర్యగా చర్చలు జరిపి సమస్యలపై కాలయాపన చేస్తూ అంగన్‌వాడీల పట్ల తమకున్న నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. జిల్లాలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 70, మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 1500 వరకూ ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఆయాలు, టీచర్లు కలిపి సుమారు 3 వేల మంది వరకూ పనిచేస్తున్నారు. వీరందరికీ కనీస వేతనాలు లేక పని భారంతో సతమతమవుతున్నారు. ఉద్యోగ భద్రత లేకుండా కనీసం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా లేకుండా ఎన్నో ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఇవి పరిష్కరించకుండానే ప్రభుత్వం లేనిపోని హామీలు గుప్పించి అమలకు మొహం చాటేసింది. అయితే సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఇదేమని ప్రశ్నించే వారిని నిర్బంధించి దౌర్జన్యానికి పాల్పడి అక్రమ కేసులు బనాయిస్తూ తన పైశాచికత్వాన్ని ప్రదర్శిస్తోంది.

వెలవెలబోతున్న అంగన్‌వాడీ కేంద్రాలు

సమ్మెకు ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినప్పటికీ అంగన్‌వాడీలు వెనక్కి తగ్గకుండా నిరసన కొనసాగిస్తున్నారు. అయితే ప్రభుత్వం తన పంథాను మార్చుకోకుండా వ్యవహరిస్తోంది. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టించింది. అయితే తాళాలు బద్దలు కొట్టారు గానీ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకొచ్చి పౌష్టికాహారం పెట్టే పరిస్థితి లేదు. దీంతో అంగన్వాడీ కేంద్రాలు వెలవెలబోతున్నాయి.

పౌష్టికాహారం సరఫరా ఏది..

బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. అయితే ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో నేడు పౌష్టికాహారం అందించే పరిస్థితి కనిపించడం లేదు. బాలింతలకు ప్రతి నెలా రెండు కేజీల రాగి పిండి, కేజీ అటుకులు, పావు కేజీ ఖర్జూరం, పావు కేజీ వేరుశెనగ చిక్కీ, అరకేజీ బెల్లం, మూడు కేజీల బియ్యం, అరకేజీ నూనె, కేజీ కందిపప్పు, 25 గుడ్లు, ఐదు లీటర్ల పాలు చొప్పున ఆరు నెలల పాటు అందిస్తుంది. అలాగే చిన్నారులకు సోమవారం పప్పు దోసకాయ అన్నం, మంగళవారం పప్పు కూర, పులిహోర, బుధవారం పప్పు ఆకుకూరలు, అన్నం, గురువారం కూరగాయల సాంబారు, అన్నం, శుక్రవారం పప్పు బీరకాయ లేక సొరకాయ, అన్నం, శనివారం వెజిటేబుల్ రైస్ అందిస్తున్నారు. అయితే నేడు ప్రభుత్వ విధానాలతో పౌష్టికాహారం వీరికి అందే పరిస్థితి లేదు. అంగన్‌వాడీలు సమ్మె చేస్తుండడంతో ప్రభుత్వం నామమాత్రం చర్యలు తీసుకొని కేంద్రాల నిర్వహణ బాధ్యతను గాలికొదిలేసింది.

చిన్నారులకు మధ్యాహ్న భోజనం పెట్టేందుకు ఆదేశాలు

జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న భోజనాన్ని అంగన్‌వాడీ చిన్నారులకు పెట్టాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను అధికారులకు జారీ చేసింది. ఒకవేళ మధ్యాహ్న భోజనం పెట్టలేని పరిస్థితిలో అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న నిత్యావసర వస్తువులతో భోజనాన్ని తయారుచేసి చిన్నారులకు పెట్టాలని హుకుం జారీ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలను బలవంతంగా తెరిపించినప్పటికీ చిన్నారులకు పౌష్టికాహారం అందించే పరిస్థితి లేకపోవడంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. దీనిపై సార్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రాల నిర్వహణ చేయలేని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఎందుకు తెరిపించిందనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. సమయానికి మెనూ బిల్లులు మంజూరు కాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతూనే అప్పులు చేసి విద్యార్థులకు భోజనాన్ని వండి పెడుతున్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు కూడా వీరిపైనే ఆధారపడి ఉండడంతో వారిపై మరింత భారం పడింది.

సమ్మె మరింత ఉధృతం

ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వంతో చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోవడంతో సమస్యలు పరిష్కరించకపోతే ప్రత్యేక కార్యాచరణతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఇటీవల ప్రభుత్వం హెచ్చరించింది. దీనిలో భాగంగా కార్యాచరణను రూపొందించి సమ్మెను మరింత ఉధృతం చేసింది. సోమవారం రెవెన్యూ డివిజన్లో నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం కేంద్రాల్లో అంగన్‌వాడీలు భారీ ప్రదర్శనలు చేశారు. ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రాలు అందజేశారు. 19న అన్ని మండల కేంద్రాల్లో భిక్షాటన చేసిన నిరసన తెలిపేందుకు కార్యాచరణ రూపొందించారు. 20న వంటావార్పు చేసి వినూత్న రీతిలో నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు. 21న అన్ని మండల కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారు.

భీమవరం ఆర్‌డిఒ శ్రీనివాసరాజులుకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు, అంగన్‌వాడీలు

తాడేపల్లిగూడెంలో..

తాళాలు బద్దలు కొట్టినా సమ్మె కొనసాగిస్తాం

ఏడో రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తాళాలు బద్దలు కొట్టినా, నిర్బంధాన్ని విధించినా సమ్మె ఆపేది లేదని అంగన్‌వాడీలు తెలిపారు. సోమవారం భీమవరం సిఐటియు ఆఫీసు నుంచి ప్రదర్శనగా అంబేద్కర్ విగ్రహం, కెఎల్ఎం రోడ్డు మీదుగా తాలూకా ఆఫీస్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకుని అక్కడ బైఠాయించారు. సమ్మెకు యుటిఎఫ్ ప్రతినిధి బృందం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి ప్రసంగించారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తుంటే పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం తన దుర్మార్గాన్ని బయటపెట్టిందన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎమ్‌డి హసీనా, డి.కళ్యాణి మాట్లాడారు. అనంతరం ఆర్‌డిఒకు, అడిషనల్ ఎస్‌పికి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, సూరిబాబు, ఇంజేటి శ్రీనివాసు, అంగన్‌వాడీ నాయకులు విజయలక్ష్మి, నాగరత్నం, దుర్గ, మార్తమ్మ పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం టౌన్ : అంగన్‌వాడీల సమ్మె ఏడో రోజు కొనసాగింది. ఈ మేరకు స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి నరసాపురం డివిజన్‌కు చెందిన అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ భారీ సంఖ్యలో ర్యాలీ చేస్తూ మెయిన్ రోడ్డు, గాంధీ సెంటర్, పాత బజార్, పంజాసెంటర్, మున్సిపల్ ఆఫీస్ రోడ్ మీదుగా ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకున్నారు. వీరితో పాటు సిఐటియు జిల్లా అధ్యక్షుడు గోపాలన్, జనసేన నాయకులు బొమ్మిడి నాయకర్, రెడ్డి అప్పలనాయుడు కూడా ప్లకార్డులు పట్టుకుని అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్‌కు వినతి పత్రం అందజేశారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు కానూరి తులసి, ఎ.రాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోపాలన్, బొమ్మిడి నాయకర్, రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము మాట్లాడారు. కార్యక్రమంలో రజనీ, నిర్మల కుమారి, రాజేశ్వరి, జి.వెంకటలక్ష్మి, ఎ.నీలిమ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏడో రోజు సమ్మె కొనసాగింది. తాడేపల్లిగూడెం, గణపవరం, తణుకు సెక్టార్ల ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి సిఐటియు పట్టణ కమిటీ సంఘీభావం తెలిపింది. అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్, కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీలక్ష్మి, ఎ.అజయకుమారి, ప్రాజెక్టు అధ్యక్షురాలు దీన స్వరూపరాణి, జి.గాయత్రి ప్రసన్న, ప్రభారాణి మాట్లాడారు. అంగన్‌వాడీలకు రూ.26 వేల జీతం ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, ఐసిడిఎస్ సెంటర్లను బలోపేతం చేయాలని, రిటైర్మెంట్ తర్వాత రూ.5 లక్షలు ఇవ్వాలని, యాప్ సిస్టంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, పతివాడ నాగేంద్రబాబు, యడవల్లి వెంకట దుర్గారావు, తాడేపల్లిగూడెం, గణపవరం, తణుకు మండలాల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా సోమవారం పాలకొల్లు ఆర్‌డిఒ కార్యాలయానికి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కోడే శ్రీనివాస ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. పెనుమంట్ర, ఆలమూరు సెక్టార్ నుండి తాడేపల్లిగూడేనికి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు తరలివెళ్లారు.

మొగల్తూరు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. మొగల్తూరు నుండి అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో భారీ ప్రదర్శనగా నరసాపురం బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పెద్దింట్లు, సారమ్మ, సీత రాజి రేఖా శాంభవి పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాలపై అవగాహనుండాలి : కలెక్టర్

ఇవిఎంను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రతి ఒక్కరూ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌కు వచ్చే వారికి ఓటు హక్కు ఏ విధంగా వినియోగించుకోవాలనే విషయమై అవగాహన కల్పించేందుకు ఏర్పాటుచేసిన డెమ్మీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్ర ప్రదర్శనను సోమవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకునేందుకు ప్రతి ఒక్కరికీ ఇవిఎంలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనిలో భాగంగానే కలెక్టరేట్‌కు స్పందన, వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి అవగాహన కోసం డమ్మీ ఓటింగ్ మిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారితో పాటు 17 ఏళ్ల వయస్సు కలిగిన వారు కూడా ప్రోగ్రెసివ్ ఓటర్లుగా నమోదు కావచ్చున్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపానాధికారి వైకెవి.అప్పారావు, ఎన్నికల సెక్షన్ తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

డిఆర్ఒ బి.శ్రీమన్నారాయణ రెడ్డి

ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిఆర్ఒ శ్రీమన్నారాయణ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్పందనలో అందిన ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడంలో ఫిర్యాదు దారులకు భరోసా కల్పించాలని డిఆర్ఒ బి.శ్రీమన్నారాయణ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి ఆర్‌సి ఆనంద్‌కుమార్, డిఎస్‌పి బి.శ్రీనాథ్‌తో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి బి.శ్రీమన్నారాయణ రెడ్డి, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 132 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం నుండి ఖండవల్లి శ్రీనివాసరావు నివాసం ఉండే వీధిలో డ్రెయినేజీ నిర్మించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని యూనియన్ గౌరవాధ్యక్షులు పివి.ప్రతాప్, జిల్లా అధ్యక్షులు పి.శాంతి స్వరూప్, కార్యదర్శి ఎస్.భవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రదర్శన నిర్వహించి డిఆర్ఒ, ఉపాధి హామీ పీడీకి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, స్వరూప్, భవాని మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు నేటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదరణ లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ అమలుకాలేదని తెలిపారు. సీనియర్, జూనియర్ ఫిల్డ్ అసిస్టెంట్లు అనే బేధం లేకుండా అందరికి ఒకే వేతనం ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే జనవరి 5న ఛలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కె.బూరయ్య, ఈశ్వరరావు, బాలకృష్ణ, వెంకటేశ్వరరావు, భీమరాజు, కెపి.రాజు, శ్రీనివాస్, దుర్గ వెంకటరమణ, నాగేశ్వరరావు, అనిత, ఏమోలియమ్మ పాల్గొన్నారు.

షేక్ సాబ్జీ మృతికి జెవివి సంతాపం

సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెవివి నేతలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఆకస్మిక మృతికి జెవివి జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. సోమవారం సంతాప సభను జెవివి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక యుటిఎఫ్ భవనం వద్ద నిర్వహించారు. ఈ సభకు జెవివి జిల్లా అధ్యక్షులు చింతపల్లి ఉదయకిరణ్ ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శులు రేపాక వెంకన్నబాబు (చెకుముకి కన్వీనర్) చిలి.రాజు, బి.రవికుమార్, వై.అజయ్‌కుమార్, అలుగు జాన్సన్, జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు చుండూరి సాయిబాబు మాట్లాడారు. షేక్ సాబ్జీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళన్నారు. దుర అలవాట్లకు యువత బానిస కాకుండా ఉండాలని ఆయన అంటూ ఉండేవారన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి డివిజన్ గౌరవాధ్యక్షులు నంద్యాల భాస్కరరాజు, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి జి.గోపీమూర్తి, జెవివి ప్రధాన కార్యదర్శి జె.రామలక్ష్మణరావు, కోశాధికారి మల్లల శ్రీనివాస్, జెవివి జిల్లా కార్యదర్శి రేపాక వెంకన్న బాబు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, సుకుమార్, కె.సత్యలక్ష్మి, సిహెచ్.పట్టాభిరామయ్య, పి.సీతారామరాజు, పి.శ్రీనివాస్ ఎ.జానన్, ఎం.ఆంజనేయులు, పెద్దిరాజు, రమేష్, సిఐటియు నాయకులు రాయ్ పాల్గొన్నారు.

రైతులు సేంద్రీయ సాగు చేపట్టాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - గణపవరం

రైతులు సేంద్రియ సాగు వైపు ఆసక్తి చూపాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. సోమవారం అప్పన్నపేటలో జరిగిన వైఎస్ఆర్ పొలంబడిలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గ్రామ సర్పంచి నూకారపు సుధాకర్‌రావు అధ్యక్షత వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో రైతులు సేంద్రియ వ్యవసాయం మారాలన్నారు. పురుగు మందులు తక్కువగా వాడాలన్నారు. నీరు, వాతావరణ కాలుష్యం, భూతాపాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసు బాబు సేంద్రియ వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించిన రైతులను అభినందించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కైగాల శ్రీనివాసు మాట్లాడుతూ పొలంబడిలో అధికారులు సూచనల మేరకు సాగు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి జె.వెంకటేశ్వరరావు, ఎడిఎ పి.మురళీకృష్ణ, ఎఒవై.ప్రసాద్ సంతోష్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని స్కూల్ స్వీపర్ల వినతి



పజాశక్తి - తణుకు రూరల్

మున్సిపల్ స్కూల్ స్వీపర్ల ఎనిమిది నెలల బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక స్కూల్స్ తనిఖీ నిమిత్తం తణుకు వచ్చిన డిఇఒ రమణకు సిఐటియు ఆధ్వర్యంలో స్కూల్ స్వీపర్లు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మున్సిపల్ స్కూళ్లలో అనేక సంవత్సరాల నుంచి పనిచేస్తున్న వారిని మండల ఎడ్యుకేషన్‌లో విలీనం చేశారన్నారు. ఏప్రిల్ నుంచి నేటి వరకూ జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఒక పక్క ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో నెలకు రూ.4000 జీతం ఏంటని ప్రశ్నించారు. మున్సిపల్ స్కూళ్లలో ఉన్న విధంగానే ప్రభుత్వం స్కూల్ స్వీపర్ శాంటేషన్ పోస్టు కొనసాగించాలని డిమాండ్ చేశారు. స్కూల్ స్వీపర్లు ఉదయం నుండి స్కూల్ అయ్యేంత వరకూ అక్కడే ఉంటారని పేర్కొన్నారు. మున్సిపల్, విద్యా శాఖ ఈ విషయంలో సమన్వయం చేసుకొని స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. డిఇఒ రమణ మాట్లాడుతూ స్కూల్ స్వీపర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గార రంగారావు, పిడి.మూర్తి, పాలని శారద, కొంగరాపు సత్యవతి, నాసరి రత్నం, బంగారమ్మ, పి.సత్యవతి, ధనలక్ష్మి పాల్గొన్నారు.


గీతికదేవిని అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ సత్యఉషారాణి

ఢిల్లీలో పరేడ్‌కు గీతికదేవి ఎంపిక

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల విద్యార్థిని ఈతకోట గీతికదేవి ఢిల్లీలో జరుగే రిపబ్లిక్ డే పెరేడ్‌కు ఎన్ఎస్ఎస్ తరపున ఎంపికైందని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. గీతికదేవి ముందుగా యూనివర్సిటీ లెవెల్ ఎంపికై, విజయవాడ కెఎల్.యూనివర్సిటీలో జరిగిన ప్రీ ఆర్‌డి క్యాంపులకు ఎంపికై ఆ క్యాంపులో సెలక్షన్స్ ఆధారంగా ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే క్యాంపునకు ఎంపికైందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పది మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రిపబ్లిక్ డే క్యాంపునకు ఎంపిక కాగా అందులో గీతికదేవి ఆరో అమ్మాయిగా ఎంపిక అవ్వడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఆమె కష్టానికి తగిన ఫలితం దక్కిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ జి.రమ్య, సిహెచ్.రమేష్‌బాబు అభినందించారు.

శశి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జెఎన్‌టియు యూనివర్సిటీ స్థాయిలో జరిగిన సెంట్రల్ జోన్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ 2023-24 వివిధ పోటీల్లో శశి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 13 పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ మహమ్మద్ ఇస్మాయిల్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 400 మీటర్ల విభాగంలో ఎ.నాగనందిని స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. 4x100 మహిళా విభాగంలో కె.గీతామాధురి, పి.స్వాతిస్వరూప, ఎ.నాగనందిని, బి.హిమదుర్గ స్వర్ణ పతకాలు సాధించారు. 4x400 పురుషుల విభాగంలో బి.తరుణ్‌సాయి, ఎస్.సాయిరాం, జి.శివశంకర్ వరప్రసాద్, పి.చక్రమణికంఠ రజత పతకాలు సాధించారు. పురుషుల జావలిన్ విభాగంలో జి.నాగశ్రీనివాసరావు, 200 మీటర్ల పరుగుపందెంలో కె.గీతామాధురి, పది వేల మీటర్ల పరుగు పందెంలో జి.శివశంకరవరప్రసాద్ రజత పతకాలు సాధించారు. పురుషుల 400 మీటర్ పరుగు విభాగంలో పి.చక్రమణికంఠ కాంస్య పతకం సాధించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, డైరెక్టర్ కె.భానుప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ మహమ్మద్ ఇస్మాయిల్, డీన్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఫిజికల్ డైరెక్టర్ లెఫ్టినెంట్ పిఎస్.శేఖర్, బి.నాగరాజు, వివిధ విభాగాల అధిపతులు, అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో సూర్యనారాయణ మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

సూర్యనారాయణ (ఫైల్‌ఫొటో)

పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు రేపూరి సూర్యనారాయణ (60) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. పట్టణంలో గత రెండు రోజులుగా టిటిడి, అన్నవరం ఉత్సవ విగ్రహాలతో జరిగిన కల్యాణోత్సవంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన రెండు పర్యాయాలు ఛాంబర్ ఉపాధ్యక్షులుగా, కొన్ని నెలల పాటు ఛాంబర్ అధ్యక్షులుగా కూడా పని చేశారు. ఆయన లయన్స్ క్లబ్, మానవతా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆయన గౌరవార్థం సోమవారం ఛాంబర్ షాపులకు సెలవు ప్రకటించారు. ఆయన మృతి పట్ల ఛాంబర్ సభ్యులు సంతాపం తెలిపారు. సూర్యనారాయణ మృతి పట్ల ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహరావు, రైల్వే బోర్డు సభ్యులు జక్కంపూడి కుమార్ సంతాపం తెలిపారు.

యువగళం ముగింపు సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కాళ్ల

యువగళం ముగింపు సభకు జిల్లా నుంచి పెద్దఎత్తున టిడిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలి రావాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎల్ఎన్.పురంలో సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ యువగళం పాదయాత్ర ఈ నెల 20వ తేదీన ముగియనుందని చెప్పారు. యువగళం పాదయాత్ర ముగింపు మహాసభకు పెద్దఎత్తున పసుపు దండు బయలుదేరి రావాలని ఆయన పిలుపునిచ్చారు. యువగళం ముగింపు సభ నవ శకానికి నాంది అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోరుకునే ప్రతిఒక్కరూ ఈ సభకు హాజరవుతారన్నారు. యువగళం ముగింపు సభకు పెద్దఎత్తున టిడిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఉండి : విజయనగరం జిల్లా పోలిపల్లిలో 20వ తేదీన నిర్వహించే యువగళం ముగింపు సభను విజయవంతం చేయాలని టిడిపి సీనియర్ నాయకుడు జుత్తిగ శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇది యువగళం ముగింపు సభ కాదని, వైసిపి దుర్మార్గ పాలన అంతానికి టిడిపి పూరిస్తున్న సమరశంఖారావం అని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినప్పటికీ లోకేష్ వెనకడుగు వేయలేదన్నారు. కేసులు, కవ్వింపులు, అవరోధాలు, అవాంతరాలు సృష్టించినా లోకేష్ వెన్ను చూపక ఎదురొడ్డి పోరాటం చేశారన్నారు. ఈ ఏడాది జనవరి 27వ తేదీన కుప్పంలో మొదలైన యువగళం పాదయాత్ర 226 రోజుల పాటు 97 నియోజకవర్గాల పరిధిలోని 2100పై చిలుకు గ్రామాల మీదుగా 3,132 కిలోమీటర్ల మేర సాగిందన్నారు. విజయనగరం జిల్లా పోలిపల్లిలో 20వ తేదీన భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ మహాసభకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లక్షలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని జుత్తిగ శ్రీనివాస్ కోరారు.

గుండెపోటుతో టిడిపి కార్యకర్త మృతి

ఆచంట : మండలంలోని ఆచంట వేమవరం పంచాయతీ పరిధి పసలపేటకు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పసల కిరణ్‌కుమార్ (46) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతదేహాన్ని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, కిరణ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ మండలాధ్యక్షులు కేతా మీరయ్య, నేతలు నెక్కంటి వీర వెంకట సత్యప్రకాష్‌రావు, దొంగ నాగార్జున, బికె.సత్యనారాయణ, గుడాల శ్రీనివాస్, నెక్కంటి సత్తిబాబు సంతాపం తెలిపారు.

పెదమల్లంలో వై ఎపి నీడ్స్ జగన్

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రజలందరి సంక్షేమాన్ని ఆకాంక్షించి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ లాభాన్ని చేకూర్చిన వ్యక్తి సిఎం జగన్ అని సర్పంచి దిరిశాల విజయలక్ష్మి అన్నారు. మండలంలోని పెదమల్లం గ్రామ సచివాలయ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులకు నేరుగా లాభాన్ని చేకూర్చే సచివాలయ వ్యవస్థను, వాలంటరీ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అవలంబిస్తున్నాయన్నారు. ప్రతి ఇంటికీ మేలు చేకూరిందని, తిరిగి జగన్మోహన్‌రెడ్డిని 2024లో ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. పెదమల్లం పంచాయతీ పరిధి పెదపేటలో గడపగడపకు తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ కొండేటి భవానీప్రసాద్, వార్డు మెంబర్లు, మాత వినయ్, నక్క శ్రీను, నేతలు మాతా గణేష్ బీర రమేష్, మాత రూప, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అగ్రిగోల్డ్ బాధితుల హామీలు అమలు చేయాలి

అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు భీమారావు

ప్రజాశక్తి - భీమవరం

అగ్రిగోల్డ్ బాధితులకు సిఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేసి బాధితులకు పూర్తి న్యాయం చేయాలని, లేకపోతే దశలవారీ ఉద్యమాలు నిర్వహించి వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధితులు సోమవారం భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి స్పందనలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోనాల భీమారావు మాట్లాడుతూ ఎనిమిది రాష్ట్రాల్లో 30 లక్షల మంది బాధితులున్నారని, ఎపిలో 12 లక్షల మంది బాధితులు, వారి కుటుంబసభ్యులు 50 లక్షల మంది ఓట్లు వేసి గెలిపించారన్నారు. అగ్రి యాజమాన్యం బాధితుల నుంచి రూ.5,700 కోట్లు దోచేశారని, వీటిలో రూ.3,080 కోట్లు బాధితులకు ఇస్తే సరిపోతుందన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం అగ్రి యాజమాన్యం ఆస్తులు అమ్ముకోకుండా చర్యలు తీసుకోవాలని, హైలాండ్, యారాడ వంటి ఆస్తులను స్వాధీనం చేసుకుని బాధితులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన అగ్రి బాధితులకు నాటి ప్రభుత్వం రూ.ఐదు లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తే రూ.పది లక్షలు ఇస్తామని జగన్ వాగ్దానం చేశారని, ఇప్పుడు రూ.ఐదు లక్షలు ఇవ్వలేదని విమర్శించారు. డిమాండ్ల సాధనలో భాగంగా దశల వారి పోరాటాలు నిర్వహిస్తామని, ఆందోళనల్లో భాగంగా ఈ నెల 28, 29వ తేదీల్లో విజయవాడలో వేలాది మంది అగ్రి బాధితులతో 30 గంటల నిరసన దీక్ష చేపడతామని, అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే ఎన్నికల్లో తగిన గుణపాఠం చేప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ భీమవరం శాఖ కార్యదర్శి కె.గోపాలకృష్ణ, గౌరవాధ్యక్షులు ఎం.సీతారాంప్రసాద్, మహిళా ప్రతినిధి వై.నాగలక్ష్మి, ఎవి.రాంబాబు, ఎన్.పల్లయ్య, ఎం.సాయిబాబు, ఐవివి.సత్యనారాయణ, బి.సూర్యనారాయణ కె.విశ్వనాథం పాల్గొన్నారు.

పేదవారికి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఒక వరం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంతి, ఎస్‌పి రవిప్రకాష్, విప్ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పేదవాడికి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా సిఎం జగన్ మరో వరం అందించారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి జగన్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడాన్ని ప్రతి ఇంటికి వెళ్లి మరింత అవగాహన కల్పిస్తూ కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సిఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్‌పి యు.రవిప్రకాష్, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి ఏకంగా రూ.25 లక్షలకు పెంచడం సిఎం జగన్ మానవత్వానికి, ప్రజల ఆరోగ్య పరిరక్షణ పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ హయాంలో 1059 రకాల వ్యాధులకు మాత్రమే వైద్యం అందేదని, తమ ప్రభుత్వం ఈ వ్యాధుల సంఖ్యను 3257కు పెంచిందని చెప్పారు. జనవరి ఒకటో తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 5,82,585 కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 30 ప్రయివేటు, ఒక జిల్లా, నాలుగు ఏరియా హాస్పిటల్స్, మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, 34 ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మొత్తం 72 హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్‌గా నమోదయ్యాయన్నారు. ఆరోగ్యశ్రీ నూతన స్మార్ట్ కార్డులు పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ అవగాహనా కార్యక్రమం, నియోజకవర్గానికి ఐదు గ్రామాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ పథకం గురించి వివరిస్తారన్నారు. అనంతరం లబ్ధిదారులకు నూతన కార్డులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి సూర్యనారాయణరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ కీర్తి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కార్డులు అందిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, విప్

ఆచంట : వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా అనేక దీర్ఘకాల వ్యాధులను నయం చేయడమే లక్ష్యంగా సిఎం జగన్ రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వైద్యానికి అయ్యే ఖర్చు నేరుగా ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించడం అభినందనీయమని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. కొడమంచిలి పంచాయతీ కార్యాలయం ఆవరణలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా, 108 అంబులెన్సు ద్వారా, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా అనేక రకాలుగా జగనన్న ప్రభుత్వంలో వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రజారోగ్యమే ప్రధాన ఎజెండాగా ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచంట మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్, డాక్టర్ సత్యవతి, ఎంపిటిసి సభ్యులు యల్లమెల్లి బేబీరాజేష్, చిలుకూరి నాగదుర్గాభవాని నరేంద్ర, ఉప సర్పంచి ములగాడ వరప్రసాద్, సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, వైసిపి ఎస్‌సి మండల అధ్యక్షులు కొండేటి రమేష్, ఎఎంసి డైరెక్టర్ జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, రావి నాగరాజు, వనమరాజు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎఎస్ఎన్ఎం కళాశాలలో నేడు జాతీయ సెమినార్

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19వ తేదీ మంగళవారం జువాలజీ, ఆక్వాకల్చర్ విభాగం సారథ్యంలో, కళాశాల ఐక్యుఎసి సహకారంతో ఆక్వాకల్చర్ వ్యవసాయం, పురోగతి, సవాళ్ళు అవకాశాలు అంశంపై జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తున్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఏలూరు వారితో కలిసి ఈ సెమినార్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. జిల్లా, పరిసర ప్రాంతాల్లో ఆక్వా కల్చర్ పరిశ్రమ అధికంగా ఉందన్నారు. వివిధ యూనివర్సిటీల నుంచి రిసోర్స్ పర్సన్లు ముఖ్య అంశాలను క్షుణ్ణంగా వివరిస్తారని తెలిపారు. ఈ సెమినార్‌లో సుస్థిర పద్ధతులు, నీటి నాణ్యత, నిర్వహణ, కచ్చితమైన ఆక్వాకల్చర్ పద్ధతులపై దృష్టి సారించి ఆక్వాకల్చర్‌లో తాజా సాంకేతిక ఆవిష్కరణలను, పర్యావరణ ప్రభావం, వ్యాధి నిర్మూలన, సామాజిక, ఆర్థిక అంశాలతో పాటు ఆక్వాకల్చర్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా డాక్టర్ ఆర్.డేవిడ్‌కుమార్‌స్వామి, జాయింట్ డైరెక్టర్, కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ మంగళగిరి, వక్తలుగా ప్రొఫెసర్ ఎ.మట్టారెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం ప్రొఫెసర్ జి.సింహాచలం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ, ఆక్వాకల్చర్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరు. ప్రొఫెసర్ సి.మంజులత, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ, ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నం కె.వెంకటేశ్వరరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వారు విలువైన సందేశాలను, సలహాలను తెలియజేస్తారని ప్రిన్సిపల్ తెలిపారు. ఆక్వా కల్చర్ సెమినార్‌లో పాల్గొనే ఆసక్తి గల విద్యార్థులు, అధ్యాపక మిత్రులు, పరిశోధన విద్యార్థులకు ప్రిన్సిపల్ ఆహ్వానం తెలిపారు. వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రటరీ జువాలజీ విభాగాపతి డాక్టర్ ఎం.రామకృష్ణను సంప్రదించాలని, విద్యార్థులందరూ పాల్గొని ఈ సెమినార్‌ను జయప్రదం చేయాలని ప్రిన్సిపల్ కోరారు.

'దళితులను మోసగించిన వైసిపి'

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని జిన్నూరులో టిడిపి, జనసేన ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో సోమవారం జగన్ ప్రభుత్వంలో దళితులకు రద్దైన 27 సంక్షేమ పథకాలు, ఎస్‌సి సబ్ ప్లాన్ నిర్వీర్యం వంటివి గడపగడపకు తీసుకువెళ్లే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఎస్‌సి సెల్ మండలాధ్యక్షులు యేళ్లమెల్లి వెంకట్రావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో దళితులకు కొత్తగా సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా గత 30, 40 సంవత్సరాల నుంచి పొందుతున్న 27 పథకాలు రద్దయ్యయన్నారు. మరి ముఖ్యంగా దళిత ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన ఎస్‌సి సబ్ ప్లాన్‌ను నిర్వీర్యం చేసి ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదన్నారు. దళితులను ప్రభుత్వం ఏ విధంగా మోసం దగా చేసిందో చెప్పేందుకు దళిత పేటలు, వాడల్లోకి వెళ్తుంటే దళితులు ఎదురొచ్చి ఈ ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, దాసరి రత్నరాజు, రాపాక విజయరత్నం, పాలపర్తి మాధవరావు, జుత్తిగ రియా, చొప్పల శ్రీను, వర్ధనపు కాంతారావు, జల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

జోగయ్యను కలిసిన పురంధేశ్వరి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో బిజెపి జిల్లా కమిటీ సమావేశానికి హాజరైన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి ఆదివారం రాత్రి మాజీ ఎంపీ చేగొండి హరరామ జోగయ్య నివాసానికి వెళ్లి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పురంధేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికలు సమీపించే కొద్దీ నేతల కలయికలు ప్రాముఖ్యత సంతరించుకుంటున్నాయి. రాష్ట్రంలో బిజెపితో జనసేన పొత్తు అధికారికంగా ఉంది. చంద్రబాబు అరెస్ట్ తర్వాత జనసేన, టిడిపి పొత్తు కుదిరింది. టిడిపి, జనసేనతో బిజెపి పొత్తు అంశం కేంద్ర నాయకత్వం పరిధిలోదని, తమ పరిధిలోకి రాదని పలుమార్లు బిజెపి రాష్ట్ర నాయకులు చెబుతున్నారు. పాలకొల్లులో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో కూడా పురంధేశ్వరి ఈ విషయమే చెప్పారు. కాపు సేన జనసేనకు బహిరంగ మద్దతు ఇచ్చారు. ఈ సమావేశానికి ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుతో పాటు మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జి హాజరయ్యారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న ఎంఆర్‌సి సిబ్బంది

ప్రజాశక్తి - కాళ్ల

సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులకు మినీమం టైం స్కేలు (ఎంటిఎస్) ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంఆర్‌సి సిబ్బంది కోరారు. ఈ మేరకు కాళ్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, చైల్డ్ కేర్ లీవ్ మంజూరు చేయాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, మరణించిన ఉద్యోగికి ఎక్స్‌గ్రేసియా చెల్లించాలి గ్రాడ్యూటీ, రూ.10 లక్షలు రెటైర్మెంట్ బెనిఫిట్ ను అమలు చేయాలన్నారు. ఈ నెల 16 నుంచి 19 వరకు పెన్‌డౌన్ మాస్ డౌన్ చేపడుతున్నామన్నారు. జెఎసి పిలుపుమేరకు ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని తెలిపారు.

తూతూమంత్రంగా రహదారి మరమ్మతులు..!

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

పొలమూరు నుంచి నౌడూరు సెంటర్ వెళ్లే ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారి మరమ్మతులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సిపిఎం, ప్రజా సంఘాలు, ఐద్వా ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో నిరసన చేపట్టారు. రహదారి నిర్మిస్తామని ఆర్‌అండ్‌బి ఎఇ యశ్వంత్ చెప్పినా కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ఈ రహదారి పనులకు బిల్లులు సరిగా రాక ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికైనా గుత్తేదారులు ఈ రహదారిని త్వరితగతిన పూర్తి చేయాలని వాహనదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

రహదారి వెడల్పు పనులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఈ పరిస్థితుల్లో పంట నష్టం నమోదుకు సంబంధించి పూర్తిగా దెబ్బతింటేనే పూర్తి స్థాయిలో పరిహారం అందిస్తామని చెప్పడం దారుణమని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంట నష్టం నమోదు విషయంలో ప్రభుత్వ వైఖరి చూస్తే కొన ఊపిరితో ఉన్నవారికి వైద్యం చేయొద్దు పూర్తిగా కోమాలోకి వెళ్లిపోవాలన్న చందంగా ఉందన్నారు. చేతికందిన పంట పడిపోయి, నీట మునిగి ఎక్కువ మంది రైతులు కనీసం 50 నుంచి 60 పంట కోల్పోయారన్నారు. ఈ పరిసితుల్లో పంట నమోదు చేస్తున్న అధికారులు మిగతా పంట మాసూలు చేయనంటేనే పూర్తి పరిహారం నమోదు చేస్తామని రైతులతో చెప్పడం దారుణమన్నారు. ఎకరానికి రూ.30 వేలు పెట్టుబడి అయితే ప్రభుత్వం కేవలం రూ.ఆరు వేలు ఇస్తుందని, ఇది ఇవ్వడానికి మీరు మిగతా పంట కోసుకుంటే 30 శాతమో, 40 శాతమో నమోదు చేస్తామనడం దారుణమన్నారు. తక్షణం 40 శాతం పంట పోయిన వారికి కూడా పూర్తి పరిహారం ఇవ్వాలని, ఎలాంటి నిబంధనలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా షష్టి వేడుకలు

పలుచోట్ల అన్నసమారాధనలు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్ల, కాళ్లకూరు, జువ్వలపాలెం, కలవపూడి, వావిలాలపాడు, సీసలి, బొండాడ, పెదఅమిరం గ్రామాల్లో శివాలయాల్లో షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వావిలాలపాడులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారిని డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు దర్శించుకున్నారు.

ఆచంట : ఆచంటలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం యాత్రికులతో కిటకిటలాడింది. పరిసర ప్రాంతాల నుంచి యాత్రికులు స్వామివారిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం వద్ద అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. కొడమంచిలి గ్రామంలో షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి రథోత్సవం నిర్వహించారు. వల్లూరు, ఆచంట వేమవరం, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, పెదమల్లం గ్రామంలో షష్ఠి వేడుకలను నిర్వహించారు.

వీరవాసరం : మండలంలో సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తోలేరులో శ్రీవల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాలబాలికలు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తోలేరు, తోలకపూడి దేవాలయాల వద్ద అన్న సంతర్పన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, చవాకుల సత్యనారాయణ, భోగిరెడ్డి శ్రీనివాసరావు, కడలి శ్రీరాములు, ఎఎంసి డైరెక్టర్ బిల్ రాజు, సర్పంచి బోనం పరమేశ్వరరావు, నాగరాజు శ్రీనివాసరాజులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణాల్లో భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని మొగల్తూరులోని ఉచ్చింత కాలువ, పెద్దపల్లవపాలెం, ముత్యాలపల్లి, వారతిప్ప, నీటితిప్ప, కోమటితిప్ప, పాతపాడు, పేరుపాలెం రామన్నపాలెం గ్రామాల్లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణాల్లో స్వామివారికి శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని ఉచ్చింత కాలువ, ముత్యాలపల్లి, వారతిప్ప, పాతపాడు గ్రామాల్లో భారీ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని పెద్దమామిడిపల్లిలో శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల గోపీ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు గౌరవ మర్యాదలతో స్వాగతం పలికి పూజ అభిషేకాలు నిర్వహించారు.

జిఒ 512ను నిలిపివేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఒ 512ను నిలుపుదల చేయాలని సీనియర్ న్యాయవాది ముత్తా రామారావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 31వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చిన ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, 512 జిఒ అమలును వ్యతిరేకిస్తూ ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ ముద్రించిన కరపత్రాన్ని ఆలిండియా లాయర్స్ యూనియన్ పట్టణ కమిటీ న్యాయవాదుల సమక్షంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ముత్తా రామారావు మాట్లాడుతూ ఈ చట్టం అమలు చేస్తే భూ వివాదాల పరిష్కారంలో రాజకీయ నాయకుల ప్రమేయం విరిగిపోయి కచ్చిదారులకు తీరని నష్టం కలుగుతుందని, బాధితులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఈ చట్టాన్ని వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఐలు కన్వీనర్ పి.వేణుగోపాల్ చౌదరి, సీనియర్ సభ్యుడు ఎస్ఎన్‌టి.బాబా, కండవల్లి మణికంఠ, ఫరూత్‌బాబు, మణిరాజు, ధర్మరాజు, జగజ్జీవన్ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, సంగులవారి వీధి, తణుకు, డోర్ నెం. 25-9-2 కు చెందిన కలిశెట్టి శ్రీనివాస్, S/o. (లేటు) అప్పలనాయుడు అను నా యొక్క ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. దస్తావేజు నెం. 3882/2011 ఉండ్రాజవరం నుండి వడ్లూరు వెళ్ళుచుండగా దారిలో పడిపోయినవి. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కలిశెట్టి శ్రీనివాస్
S/o. అప్పలనాయుడు (లేటు)
డోర్ నెం. 25-9-2, సంగులవారి వీధి,
తణుకు, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 95053 53333

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, కొవ్వలి గ్రామ కాపురస్తులు చంపాటి నరశింహరాజు గారి కుమారుడు చంపాటి రామరాజు అను నాకు గల ఆర్.ఎస్. నెం. 188లో గల 61.11 చదరపు గజాలు గల వట్లూరు స్థలమునకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు 8328/2014 మరియు 1230/2009 అను ఈ రెండు దస్తావేజులు ది. 12-12-2023వ తేదీన కొవ్వలి నుండి ఏలూరు వెళుతుండగా దస్తావేజులు కలిగిన కవర్ సత్రంపాడు మార్గం మధ్యలో పడిపోయినది. కావున దొరికినవారు క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

చంపాటి రామరాజు
కొవ్వలి గ్రామం, ఏలూరు జిల్లా
పిన్: 534007
సెల్: 9866294428

దస్తావేజులు పోయినవి

మా క్లయింటుకు కొమరవరం (వి), తణుకు (మం)లో R.S. No. 5/2, 5/5 లో చ॥గ॥ 103.88లో వున్న ఆర్.సి.సి. బిల్డింగ్ డో.నెం. 8-14/1, తణుకు S.R.O. లో కాబడిన డాక్యుమెంటు యొక్క లింకు డాక్యుమెంటు Sale Deed Doc. No. 1794/2019, dated: 08-03-2019, వేల్పూరు గ్రామంలో గల జిరాక్స్ తీసుకుని వస్తుండగా 09-10-2023వ తేదీన పడిపోయినది. ఎంత వెతికినా కనిపించి యుండలేదు. కావున ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు తెలియచేయగలరు.

క్లయింటు అడ్రసు:
ఆకుల కృష్ణకిషోర్, S/o. సత్యనారాయణ, R/o. డో.నెం. 24-188/1, ఎన్.టి.ఆర్.కాలనీ, వేల్పూరు, తణుకు మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పమ్మి వి.నాగ వీరభద్రుడు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా
సెల్: 77023 11197

PUBLIC NOTICE

This Public notice is given on the instructions of my client Akula Krishna Kishore S/o Satyanarayana. R/o D.No. 24- 188/1, NTR Colony, Velpur, Tanuku Mandal, West Godavari Dist.,

That my client having an RCC Building in extent of Sq. 103.88 Yards in R.S. No. 5/2 & 5/5 of Komaravaram (V), Tanuku (M). There is a link document i.e., Regd. Sale deed executed on 08- 03-2019 and registered as Doc. No. 1794/2019 at Tanuku S.R.O. which was lost by my client while he was traveling in Velpuru Village to obtain Xerox copy on 09-10-2023. Therefore this public notice is issued to all that anybody was in possession of the said Original document they shall come forward with documentary proof withi 7 days from the date of this notice to undersigned, else of shall be deemed that there are no claims (or) objections over the scheduled property and the transactions will be proceeded with.

PAMMI V.NAGA VEERABHADRUDU
Advocate, Tadepalligudem, W.G.Dt.,
Cell: 77023 11197

మహారాజశ్రీ కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 116/2021

Between:
భట్రాజు రవికుమార్ -వాది
AND
1. కొయనాని పద్మావతి
2. మరడా శ్యామ్ సునీత, W/o. వెంకట అప్పారావు, 46 సం॥లు, గృహిణి, అల్లూరు, ముదినేపల్లి మండలం. **-ప్రతివాదులు**

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మరడా శ్యామ్ సునీత, W/o. వెంకట అప్పారావు అను వారికి దావా సమన్లు అమలు కొరకు **ది. 04-01-2024 వాయిదా అయియున్నది.** సదరు వాయిదా రోజు పై కోర్టులో వారి ఎదుట **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలయును. లేని యెడల మీ పరోక్షమందు దావా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా: 04-01-2024

M.SATYANARAYANA RAJU
కైకలూరు Advocate, Kaikalur-521333
12-12-2023 Cell: 9440103025